# గోడల్లేని జైలు

పదిహేనేళ్ళ క్రిందట కొండలతో, అడవులతో పీచుపీచు మంటున్న ఆ ప్రాంతంలో ఇప్పుడో మహానగరం వెలసింది! ఆ చివరినుండి, ఈ కొసదాకా వందలాది విద్యుద్దీపాలు, రాత్రిని పగటిక్రింద మార్చేస్తున్నాయి. ఆనకట్ట మీదినుండి కృష్ణవేణి దిగువకు దూకి, చిద్రుపలు, చిద్రుపలై తుంపరులుగా మారి, ఇంతెత్తున ఎగసిపడి, తిరిగి నీరై సుడులు తిరుగుతూ ముందుకు పరుగెత్తుతున్నది. ఆనకట్టకు ఎగువన జలాశయం, మసకమసగ్గా కొండలు; లైట్లకాంతి అలల మీద పడి ముక్కలయి, లయించిపోవడమూ చిత్రమైన అనుభవం!

తనిక్కడకు బదిలీ అయినట్టు తెలిసినరోజున సూర్యారావు అక్షరాలా భయపడ్డాడు. తనకేవో సదుపాయాలూ, సౌకర్యాలూ లోపిస్తాయని కానేకాదు. అరవైమంది ఖైదీలను అజమాయిషీ చేయాలి. వారిచేత పనిచేయించాలి; వారు పారిపోకుండా చూడాలి. ఖైదీలకిది గోడల్లేని జైలు—కానీ తనుమాత్రం ఖైదీల మధ్య ఖైదీ అయ్యాడు.

కావచ్చుగానీ - ఈ ఆరుమాసాల కాలంలోనూ, తను అరవై సంవత్సరాల అనుభవాన్ని సంపాదించాడు. ఒక్కో ఖైదీ గాథ వింటుంటే గుండెలు అవిసిపోతున్నాయి. కావడానికి అందరూ నేరస్థులే! కానీ, ఏ ఇద్దరి నేరస్థులకూ పోలికలే లేవు. నేరాన్నే తప్ప, ఆ నేరం చేయడానికి వెనుక గల పరిస్థితులను గ్రహించేటంత విపులంగా——న్యాయశాస్త్రం లేకపోవడం దౌర్భాగ్యమే! చేసిన తప్పుకు శిక్ష ననుభవించడాన్ని తనూ కాదనడు. కానీ — ఏ తప్పూ చెయ్యనివారు - ఖైదీలుగా మగ్గిపోతున్నారు.

తన గుండెను పట్టి పల్లార్చుతున్నవి ఇటువంటి సంఘటనలే !

సూర్యారావు ఉలిక్కిపడ్డాడు. ఖైదీల కాంపు గేటు దగ్గర ఏదో నీడ కదుల్లాడుతున్నట్లనిపించింది. ఒక్కసారిగా నెత్తురంతా తనలోకి ఎగజిమ్మినట్లుగా గిజగిజ లాడిపోయాడు సూర్యారావు. కొంపదీసి ఏ ఖైదీ అయినా పారిపోవడం లేదుగదా! ఛరాలున లేచి, నాలుగడుగులు ముందుకేశాడు. గేటుదగ్గరి నీడ గేటును తీసి, రోడ్డుమీదికొచ్చింది. సూర్యారావు పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. ఒక్క పరుగులో వెళ్ళి, అమాంతం వాణ్ణి వాటేసుకొంటే! 'పట్టుకోండి! పట్టుకోండి!!' అంటూ బిగ్గరగా అరిస్తే !

నీడ క్రమంగా సూర్యారావుకేసే వస్తున్నది. మధ్య మధ్య ఆగి - అటూ ఇటూ చూస్తున్నది. ఎరిగిన ముఖాలేవీ లేకపోతే - ఉడాయిద్దామనేమో! రోడ్డు దిగి, కొండల్లోకి పారిపోతే, వాణ్ణి పట్టుకోడం తనవల్లకాదు.

సూర్యారావు నెత్తురుకు తిమ్మిరెక్కి నట్లయింది. చొక్కా చేతులు మడిచి, గబ గబా ముందుకు సాగాడు. జీబురు జుట్టు ఆనందం - అతని దగ్గరనే వచ్చి అల్లంత దూరంలో నిలబడ్డాడు.

"మీ రీడున్నారా దొరా !" అన్నాడు ఆనందం, రపంత ఆదుర్దాగా! 'తమర్ని గదికాడ ఎతికానండీ! తలుపులు-బారాబాటకంగా తెరిసున్నాయండీ ! ఏందా ఈ స్తితమను కుంటూ - వాకేల - యీడగానీ ఉండా రేమోనని - యెతుక్కుంటున్ననండీ !

సూర్యారావుకు పట్టిన చెమటలు ఆరిపోయాయి. రోడ్డు దిగి, నీళ్ళ వెంపుకు తిరిగి కాళ్ళు బార్లా జాపి, చేతులు వెనక్కు చేర్చి జారగిల బడ్డాడు.

ఆనందాన్ని 'కూచో' మన్నాడు. అతను రెండడుగులు వెనక్కు వేసి, చదికిలబడి సూర్యారావు కేసి చూశాడు.

"తవఁరెందుకో - నన్ను కనిపియ్యమన్నా రంటగా బాబయ్యా ?" అన్నాడు ఆనందం.

ఓక్షణం ఆలోచించాకగానీ, సూర్యారావుకు తనెందుకు ఆనందాన్ని రమ్మన్నదీ జ్ఞాపకం రాలేదు. సన్నగా నవ్వి చేతిలో ఉన్న మంటిబెడ్డను నీళ్ళల్లోకి విసిరాడు.

"ఇందాక రిజిష్టరు చూస్తుంటే—నీ పేరు కనిపించింది. మరోవారం రోజులకల్లా, నీ శిక్ష పూర్తవుతుంది. ఆసంగతి చెబుదామని !"

"ఇంకా వారమేనా ఉంది బాబయ్యా !" అన్నాడు ఆనందం తలొంచుకొని.

అతనుగానీ, తన శిక్షాకాలాన్ని గుర్తుచేసుకొంటున్నాడేమో ననుకొన్నాడు సూర్యారావు.

ఓపావు నిమిషం ఆగాక—

"నిన్నో విషయం అడగాలని, చాలా రోజులుగా అనుకొంటున్నాను ఆనందం!"

ఆనందం మెల్లగా తలెత్తాడు—చొక్కా అంచుతో కళ్ళు తుడుచుకొన్నాడు.

"ఆరు మాసాలుగా నిన్ను చూస్తున్నాను. ఇక్కడున్న ఖైదీలందరిలోకీ నువ్వు మంచివాడివని, నా నమ్మకం. తోటి ఖైదీలుకూడా 'నువ్వు దేవుడి' వన్నారు. అవునా మరి—నీవంటివాడు—ఆ పాడుపని యెందుకు చేసిందీ నాకు అర్థంగాలేదు."

ఆనందం ఏడుస్తున్నాడు.

'నిజం చెబుతున్నాను బాబయ్యా ! ఆ వాములు నేను తగలబెట్ట లేదుండీ!'

విషయం మార్చడం మంచిదనుకొన్నాడు సూర్యారావు. అందుకని ఊరూ వాడా, పొలం పుట్రా గురించి అడిగాడు.

"నాది నాయుడుపాలెం బాబయ్యా !"

సూర్యారావు గతుక్కుమన్నాడు. నాయుడుపాలెం తనకూ తెలుసు. తన అక్కా, బావా, సుందరం, అక్కడేగా వున్నదీ! పెద్ద చెరువూ, చుట్టూరా మర్రిచెట్లు, వేణుగోపాల స్వామిగారి గుడీ, మెట్లకెదురుగా పోలీసు స్టేషను, ఇంకో మూలన సత్రవూం - తను చిన్నప్పుడు మర్రిచెట్లమీద కోతి కొమ్మచ్చులాడుకోవడం, కొండమీద మల్లేశ్వర స్వామివారి గుడీ - తంగేడు పొదల్ని దాటుకొంటూ, తనూ సుందరమూ కొండెక్కి, కోనేట్లో ఈతకొట్టడమూ - యెంత మంచి రోజులవి!

ఆనందం గుటకలు మింగి, సూర్యారావుకేసి చూశాడు.

"ఊఁ చెప్పు వింటున్నాను" అన్నాడు సూర్యారావు పాతజ్ఞాపకాల తెరలను తొలగించుకొంటూ.

* * *

జిల్లాబోర్డులున్న రోజుల్లోనే ఆ వూరివాళ్ళు స్కూలు తెప్పించుకొన్నారు. ఆసుపత్రి పెట్టించుకొన్నారు. డొంకల్ని వెడల్పుచేసి, కంకరరోడ్లు వేయించుకొన్నారు. పెదకాపు అప్పయ్యగారు తూర్పుబజారుకు నాయకుడు - నరసయ్యగారు పడమటి బజారుకంతా పెద్దరైతు.

నకిలేశుగాడు చాలాకాలంగా అప్పయ్యగారి కమతం లోనే ఉన్నాడు. అరకట్టడం ప్రారంభించిందికూడ వారి పొలంలోనే! అప్పయ్యగారికి వ్యాపకాలు జాస్తి. వ్యవసాయ

మంతా నకిలేశుగాడి కప్పగించి అప్పయ్యగారు నిశ్చింతగా వుండసాగాడు.

నకిలేశుగాడయినా, తను జీతగాణ్ణని ఒక్కనాడూ అనుకోలేదు. రాత్రింబవళ్ళు సొంతపనులు చూసుకొన్నట్లే చేశాడు. బస్తాలు తెచ్చి, మెట్టుగట్టి, తనగుడ్డ దులిపి, భుజాన వేసుకొని, మునగచెట్టు మొదట్లో కూచుంటే, అప్పయ్యగారి భార్య గ్రహించి, మానెడో, అడ్డెడో పై గుడ్డలో పోసి పంపించేది.

ఉన్నరోజున కడుపు నిండా తిన్నాడు. లేనిరోజున గటక తాగి, 'అమ్మోర్నిరి గుడికాడ' లిల్లాయి పాటలు పాడాడు.

ఏ మాట కామాటే చెప్పకోవాలి - లచ్చాంవ్ గూడా గొడ్డులాగా పనిచేసేది. తొలకరి మళ్ళగానే, గడ్డి గుడ్డ నెత్తి నేసుకొని చీకటితో, గనాల మీదికి పోతే, మధ్యాహ్నని కల్లా ఏనుగంత మూటేసుకొచ్చేది. ఏ రైతు ఇంటి దగ్గరో పడేసేది - ఇన్ని మిరపకాయలో, ఇంత ఉప్పు గోంగూరో, కొరివి కారప్పచ్చడో తెచ్చుకొనేది. ఎండాకాలం పుల్లా పుటకా ఏరి, పొయ్యికింద బాధ తప్పించేది. కోతలయ్యాక పరిగ ఏరడానికి పొయ్యేది.

ఆనందంగాడికి రెండేళ్ళొచ్చిందాకా, లచ్చాంవ్ ఎటు కదలడానికీ వీల్లేక పోయింది. అప్పటికీ ఉండబట్టలేక—తొలక లేరడానికో, కాయకొట్టడానికో—చంటాణ్ణి కూడా తీసుకొని పోతూఉండేది.

ఇంతగా విరగదీసుకొన్నా — సంవత్సరంలో సగం రోజులు, ఖాళీగానే ఉండాలిసొచ్చేది. ఆ బెట్ట రోజుల్లో గూడెం, గూడెమంతా — ఆవు రావురుమని పోయేది. గూడెంలో ఉన్న పదిమంది పెద్దవాళ్ళూ కూడబలుక్కొని, ఏ పెద్ద రైతునో బతిమాలీ, బామాలీ—పదిబస్తాల గింజలు తెచ్చుకొని—కాలం వెళ్ళబుచ్చుకొనేవారు. బెట్ట రోజుల్లో అప్పులిచ్చిన రైతుల బాకీలు—సగానికి సగం కూలీకి పన్లు చేసి—చెల్లుబెట్టాలి. ఆ షరతుమీదనే రైతులు అప్పు లిస్తారు; అందు కొప్పుకొనే, గూడెంవాళ్ళూ గింజలు తెచ్చు కొంటారు.

కొడుక్కన్నా నాలుగక్షరం ముక్కలు చెప్పింతామని నకిలేశు చాలా తంటాలు పడ్డాడు. అయినా వీలు పడింది కాదు. గూడెంలోనా—అప్పటి కింకా స్కూల్లేదు. పోనీ వూళ్ళోఉన్న స్కూలుకు పంపుదామంటే—అప్పయ్యగారు జ్ఞాపకం వచ్చి వణికిపోయాడు నకిలేశు.

అదీగాక—వాణ్ణికూడా ఏ 'అయ్య' దగ్గరో పడేస్తే, వాడి పొట్ట వాడే పోసుకొంటాడు. బళ్ళోకి గిళ్ళోకి పంపుతే—బరువంతా తనే మొయ్యాలి. పొట్టకే అస్తు బిస్తుగా ఉంటే—వాడి పలకలు; పుస్తకాలు, మంచి మంచి గుడ్డలు, ఇవన్నీ తనవల్ల అయ్యే పనులేనా ?

బీట్లో గొడ్లు మళ్ళేయడం అయిపోయి, ఆనందంగాడు చాలుపట్టే ఈడుకొచ్చే నాటికి, నకిలేశు పూర్తిగా కుంగి పోయాడు. ఇదివరకు అరవై మానికల ఉక్కటాన్ని అమాంతం

లేపి, పెండె కట్టేవాడు—ఇప్పుడు, ఖాళీబండి పోలెత్తా లంటేనే ఎగశ్వాస పుట్టుకొస్తున్నది.

"ఇక నా పనయిపోయిందే వొసేవ్ !" అన్నా డొక రోజున నకిలేసు, నులకమంచం మీద వెల్లకింతలా పడుకొని.

ఆ మొన్నాడే అప్పయ్యగారు, వాడికో జత కొత్త పంచలిచ్చి కమతంలోంచి పంపించాడు.

ఇది జరిగిన రాత్రే నరసయ్యగారు, గూడెం దగ్గర చిట్టికేశ్వరం చెట్టుదగ్గర నిలబడి, ఆనందానికి కబురు చేశాడు. తన కమతంలో కొస్తే అప్పయ్య యిచ్చేదానికన్నా నాలుగు బస్తాలు యెక్కువిస్తా నన్నాడు. తన పొలం తాళ్ళదగ్గరే ఉన్నదన్నాడు. పొలానాన్నుకొనే బీడు కూడా ఉన్న దన్నాడు.

"నువ్వో గొడ్డునో, గోదనో కొనుక్కోరా ! కావా లంటే నేను అప్పిస్తాను తీసుకో. నా గొడ్లతోపాటే దాన్ని నా బీట్లో మేపుకో. నేను కాదనను. మీ అయ్య నీకు పెళ్ళీ గిళ్ళీ చెయ్యాలంటున్నాడు. ఖర్చులు నేను పెట్టుకొంటానని చెప్పు... రేపు మంచిరోజు. పొద్దున్నే రా. కొత్త పంచలు కట్టుకొని, పనిలో చేరుదువుగాని"

"మా అయ్య నడుగుతా దొరా !" అన్నాడు ఆనందం.

నరసయ్యగారు ఓ నిమిషం ఆలోచించి, తనో చుట్ట చుట్టుకొని, ఒక పాయుపొర ఆనందంమీదికి విసిరేశాడు.

"సరేరా! నీ యిష్టం!" అన్నాడు నరసయ్య. "శాంం చేద్దాం గదా అనుకొన్నాను. నీ కా రాత లేకపోతే నేనేం చేసేది? పనిలోకి వస్తే వచ్చావు, లేకపోతే క్షేమగానీ— పొద్దున్నే వచ్చి పంచలు కట్టుకెళ్ళు. అవి నీకనే తెప్పించాను."

ఆ రాత్రి ఆనందానికి నిద్రపట్టలేదు. రెండు మూడు సార్లు తండ్రిని లేపి, ఈ సంగతి చెబుదామా అనుకున్నాడు. తీరా చెప్పాక ఆయన కాదంటే—తను నరసయ్యగారి కమతంలోకి పోవడం బావుండదు. అందుకని ముందుగా చెప్పా చెయ్యకుండా చేరిపోతే సరి! ఆయనడిగినప్పుడు ఏదోవిధంగా సర్దుకోవచ్చు.

నరసయ్యగారి కమతంలో ఆనందంగాడు చేరాడని తెలిశాక అప్పయ్య దిమ్మరపోయాడు. ఆ మాటలు నమ్మలేక రుజువు చేసుకోవడం కోసం, పోస్టాఫీసుకు పనున్న వాడిలాగా వెళ్ళాడు. ఆనందంగాడు—సిగమోర ముడిబిగిస్తూ కనిపించాడు.

అప్పయ్యగారు ఏమీ అనలేదు. ఆయన కళ్లుమాత్రం నిప్పుల్లా మెరిశాయి.

మరో మూడు మాసాలకల్లా పంచాయితీ ఎన్నికలు రానే వచ్చాయి. ఊళ్ళో ఉన్న పదిమంది పెద్దలూ మర్రిచెట్టుకింద కూచుని మాట్లాడుకున్నారు. పోటీ లేకుండా ఎన్నికలు జరిపితే బావుంటుందన్నారు. కానీ సీట్లదగ్గర కొచ్చేసరికి

పేచీలు తలెత్తాయి. ఏ వార్డులో యెవర్ని నిలబెట్టాలో తేల లేదు. అప్పయ్యగారొక కొమ్ము కాశారు. రెండో కొమ్మును నరసయ్యగారు కాశారు.

సాయంత్రానికల్లా గ్రామం రెండు ముఠాలుగా చీలి పోయింది. ఎవరి మనుషుల్ని వారు ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరూ డబ్బు మూటలు విప్పుకు కూచున్నారు.

నరసయ్యగారు ఐదొందల రూపాయలు ఆనందాని కిచ్చి గూడెంలో పంచిపెట్ట మన్నారు.

"ఈ నెలరోజులూ—పని గివి జాంతానై, మీ వాళ్ళం దరినీ కలుసుకోరా! యింటికి పది చొప్పున పడెయ్. గూడెం ఓట్లన్నీ మనవాడికే పడాల - జాగర్త" అన్నాడు నరసయ్య.

కిటుకేమిటో తెలీదుగానీ—ఈ విషయాలన్నీ అప్పయ్య గారికి చేరిపోతూ ఉండేవి. ఆయనొక రోజున వెయ్యిరూపా యల చిల్లరనోట్లు సంచిలో వేసుకొని స్వయంగా గూడేనికి వచ్చాడు. ఇల్లిల్లూ తిరిగి, వెయ్యిరూపాయలూ పంచిపెట్టి మీసాలు దువ్వుకుంటూ వచ్చాడు. ఆ రాత్రే నరసయ్య గారూ, ఆనందం కలిసి, గూడేనికి వచ్చారు. 'అమ్మోరి' గుడిదగ్గర నరసయ్యగారు చిన్న సభ కూడా చేశాడు.

"మీకు స్కూలు కట్టిద్దా మనుకుంటున్నాను. మంచి నీళ్ళకు మీరు చాలా అవస్థ పడుతున్నారని ఆనందం చెప్పాడు. ఆనందమంటే నాకు చాలా గురి. అతను అడిగిన వన్నీ చెయ్యటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇదిగో—ఈగొడ

వయి పోయ్యాక—బావులు—రెండు బావులు, తీయిస్తాను సరా! ఆనందం చెప్పినవాళ్ళకే మీరు వోట్లేయండి!"

అందరిచేత, అమ్మవారిమీద వోట్లు కూడా వేయించుకున్నాడు నరసయ్య.

ఎన్నికలింకా మూడు రోజులున్నాయి. అప్పటికే—అదనంగా కొంతమంది పోలీసులు, నాయుడుపాలెం వచ్చి మునసబు కచేరీలో తిష్ఠ వేశారు. అటు అప్పయ్యగారూ, ఇటు నరసయ్యగారుకూడా వారికి 'సప్లయిలు' అందించారు.

గ్రామమంతా చెప్పరాని ఉద్వేగంతో కుత కుతలాడి పోతున్నది. ప్రతివారూ ఎదటివాడిని శత్రువును చూసినట్లు అనుమానంగా చూడసాగారు. ఏ ముఠాలోని ఏ అభ్యర్థికి ఎన్నెన్ని వోట్లు వచ్చేదికూడా ఖచ్చితంగా లెఖ్కలు తేలిపోయాయి. ఇక తేలవలసిందల్లా గూడెంలోని వోట్లే! గూడెం యెటువేపు మొగ్గితే, అటు గెలుపు ఖాయమవుతుంది.

రేపులేదు ఎల్లుండి పోలింగ్ అనగా, నరసయ్యగారు యాభై బస్తాలవడ్లు మర పట్టించి, గూడేనికి తోలిపెట్టాడు. పాలిక కోళ్ళను, పై ఖర్చులకు వంద రూపాయలనూకూడా పంపించాడు.

ఆ మధ్యాహ్నమే అప్పయ్యగారు, రెండు బళ్ళనిండా బియ్యబ్బస్తాలూ, రెండు నేతిడబ్బాలూ, నిలువుడెత్తు గుడ్డల మూటలు నాలుగు, పట్టించుకెళ్ళి గూడెంలోని పెద్దల కప్పగించి మరీ వచ్చాడు.

గూడెంలోని వాళ్ళకేమీ పాలుపోవడంలేదు. ఆసం దానికి పిచ్చెత్తి పోతున్నట్లయింది.

ఎన్నికల రోజున తెల్లవారేటప్పటికే జనమంతా వీధుల్లోకివచ్చారు. గూడెంలోని పోలింగ్ బూత్ దగ్గర నరసయ్యగారూ, అప్పయ్యగారూ వీరంగం తొక్కుతున్నారు.

ఆనందం గూడెం, గూడెం మొత్తాన్నీ వరసల్లో నిలబెట్టి, చీట్లు రాయించి, బూత్ లోకి పంపిస్తున్నాడు. నకిలేశుగాడూ, లచ్చావ్:, అప్పయ్యగారి వరసలో నిలబడి, వాళ్ళ మనుషులదగ్గరే చీట్లు తీసుకొన్నారు...

—ఫలితాలు తెలిశాయి.

పన్నెండు వోట్లు తేడాతో నరసయ్యగారి మనిషి ఓడిపోయాడు. ఈ ఓటమివల్ల పంచాయితీలో, నరసయ్యగారికి మెజారిటీ పోయింది. నేడో రేపో అప్పయ్యగారు గ్రామ సర్పంచ్ అయిపోతారు.

అప్పయ్యగారి మనుషులు, ఆ రోజు సాయంత్రం పెద్ద ఊరేగింపును లేవదీశారు. ఊరేగింపు నరసయ్యగారి ఇంటి ముందు చాలాసేపు నిలబడింది. తెచ్చిన మందుగుండు సామగ్రిలో ముప్పాతిక భాగం నరసయ్యగారింటిముందే కాల్చేశారు. చాలా పొద్దుపోయిన తరవాతగానీ ఊరేగింపు అక్కడనుండి కదల్లేదు.

అర్ధరాత్రిపూట అప్పయ్యగారి గడ్డివాములకు నిప్పు అంటుకున్నది. గ్రామమంతా ఒక్కసారిగా గుప్పుమన్నది.

నిప్పుముట్టించి పారిపోతున్న ఆనందాన్ని పట్టుకొని, పోలీసుల కప్పగించారు నరసయ్యగారు.

సూర్యారావు కొంచెం ముందుకు జరిగి ఆనందం కళ్ళను వెదికాడు.

*　*　*

"భగవంతుడి ముఖం చూసి చెప్పు ఆనందం! నిజంగా నువ్వాపని చెయ్యలేదా ?"

ఆనందం అమాంతంగా సూర్యారావు కాళ్ళు పుచ్చుకొని లబ్బుమని ఏడ్చాడు.

"లేదు బాబయ్యా! నే నే పాపం యెరుగనండీ! ఓడిపోయిన కోపంలో నరసయ్య బాబుగారే, ఆరివామికి అగ్గి ముట్టిచ్చారు బాబయ్యా! నేను కంటారా సూసినానుండీ! నడిరేతిరి కాడ - నరసయ్య బాబుగారు యాడికో పోతుంటే అగాయిత్తం చేసుకుంటారేమోనని, యనకమాలే పోయాను బాబయ్యా! ఆరు అగ్గెట్టి, నా మీదికి తోసేసినాడండీ! సాచ్చీకమంతా నా కెదురుసెప్పింది... దోసిల్లతో డబ్బు మప్పిన్రు బాబో, డబ్బు మప్పిన్రు!"

తల తిరిగి తూలిపడబోయాడు సూర్యారావు. ఆనందాన్ని లేపి, కూచోబెట్టాడు. తనూ కళ్ళు తుడుచుకొన్నాడు.

"జరిగిందంతా మర్చిపో ఆనందం... శుభ్రంగా మీ ఊరెళ్ళు... ఈ గొడవల్లోకి దిగకు... మంచిపేరు తెచ్చుకో." అన్నాడు సూర్యారావు తుంపులు తుంపులుగా!

"ఒద్దు బాబయ్యా, వొద్దు" అంటూ, సూర్యారావును వాటేసుకొన్నాడు ఆనందం ! "ఆడ నేను బతకలేను బాబయ్యా ! జైల్లో పెడితే, గోడలు పగల్నాకి, సువ్వలు వొంచేసి పారిపోవచ్చు. అక్కడుంటే బాబయ్యా - కని పియ్యని గోడలు సుట్టూ ఉన్నయ్యి బాబయ్యా ! ఆటిని దాట్టం నా శాతకాదు బాబయ్యా ! మీరేదన్నా కేసు పెట్టండి, దయ సూపిచ్చండి, నన్నిక్కడే పడుండనీయండి. ఇంత శాకిరీ సేస్కుంటూ బతుకుతా. నామీద - దొంగ కేసు పెట్టండి... పారిపోతుంటే పట్టుకొన్నానని రాయండి. బాబయ్యా ! నన్నొగ్గెయ్యకండి !"

ఆనందం లగ్గలకెత్తిపోతున్నాడు !

నిప్పు ముట్టించి, సుఖంగా తప్పుకొన్న తన బావను తలుచుకొని, సూర్యారావు హృదయం ఘోష పెట్టింది !